సాక్షి
నల్లగొండ
శనివారం । 16 । సెప్టెంబర్ । 2023



హాస్టల్‌లో అధికారుల విచారణ
మిర్యాలగూడలోని హాస్టల్‌లో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. - IIలో



కాంగ్రెస్ పార్టీదే అధికారం
వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. - IVలో



వెయ్యేళ్లనాటి శిల్పం
చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం గ్రామంలో వెయ్యేళ్లనాటి శిల్పం, శిలాశాసనం వెలుగులోకి వచ్చాయి. - IVలో

న్యూస్‌రీల్

డీసీసీబీకి ఉత్తమ అవార్డు



సీఈఓకు అవార్డును అందజేస్తున్న సిబిల్ ప్రతినిధులు

నల్లగొండ అగ్రికల్చర్ : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)కి క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా లిమిటెడ్(సిబిల్) కంపెనీ ప్రతినిధులు శుక్రవారం హైదరాబాద్‌లో ఉత్తమ అవార్డు అందజేశారు. సిబిల్ స్కోరు ప్రకారం ఎటువంటి పొరపాట్లు జరగకుండా సరళమైన రీతితో రుణాలు మంజూరు చేస్తున్నందున డీసీసీబీ సీఈఓ కె.మదన్‌మోహన్‌కు అవార్డు ప్రదానం చేశారు. ఉద్యోగుల సమష్టి సహకారంతో ఉత్తమ బ్యాంకు అవార్డు సాధించామని సీఈఓ మదన్‌మోహన్ పేర్కొన్నారు.

న్యాయ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని మాల్ బౌలీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ బి.దీప్తి వివిధ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పారా లీగల్ వలంటీర్ భీమనపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్‌మెన్ సస్పెన్షన్

మిర్యాలగూడ : దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్‌ప్లాంట్‌లో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.రవితేజపై సస్పెన్షన్ వేటు వేస్తూ టీఎస్ జెన్‌కో చీఫ్ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారి ఎ.ముత్యంరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రవితేజ శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో పని చేస్తుండగా సహచర ఉద్యోగులతోపాటు ఉన్నతాధికారులతో అనుచితంగా వ్యవహరించినందున ఇక్కడికీ బదిలీపై వచ్చారు. విచారణ జరిపిన అధికారులు నివేదిక ఆధారంగా ఉద్యోగం నుంచి రవితేజను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

మిషన్ భగీరథ నీరు అందేలా చూస్తాం



మాట్లాడుతున్న ఎస్‌ఈ సురేష్

త్రిపురారం : ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఎస్‌ఈ సురేష్ పేర్కొన్నారు. త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన ఇరిగి క్రాంతికుమార్ తమ గ్రామానికి మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదని ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్‌కు, కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశాడు. దీంతో స్పందించిన భగీరథ ఎస్‌ఈ సురేష్ శుక్రవారం గ్రామానికి వచ్చి గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో నల్లాలు, వాటర్ ట్యాంక్‌లు, ఇళ్లలోని నల్లాను పరిశీలించారు. భగీరథ నీరు అందే విధంగా ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఎల్‌ఓ ప్రతాప్‌నాయక్, భగీరథ ఏఈ మోహన్ గాంధీ, ఈఈ ముజీబుద్దీన్, డిప్యూటీ ఈఈ మధు, క్రాంతి కుమార్, రమేష్ సింగ్, లక్ష్మణ్ సింగ్, కోటేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో లక్ష పుష్పార్చన



లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం శుక్రవారం రాత్రి భక్తులతో కిక్కిరిసిపోయింది. అమవాస్య కావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమవాస్య సందర్భంగా దేవాలయంలో ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సతీష్‌శర్మ, సురేష్‌శర్మ, శ్రీకాంత్‌శర్మ వేద మంత్రాలతో స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

కాంగ్రెస్‌లో చేరికల జోష్



- 20వ తేదీన కాంగ్రెస్ కండువా వేసుకోనున్న వేముల వీరేశం!
- తుక్కుగూడ సభ కోసం జన సమీకరణకు వీరేశం ఏర్పాట్లు
- నేడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో చేరనున్న బాలకృష్ణారెడ్డి
- త్వరలో 'హస్తం' గూటికి మరికొందరు బీఆర్‌ఎస్, బీజేపీ అసంతృప్తులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కాంగ్రెస్ పార్టీలో చేరికల జోష్ మొదలు కాబోతోంది. సాధారణ ఎన్నిలకు సమయం దగ్గర పడుతుండడంతో బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నుంచి అసంతృప్తులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీలో టికెట్ దక్కని వారిలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ నుంచి ఇటీవల సస్పెండ్ అయిన జిట్టా బాలకృష్ణారెడ్డి భువనగిరి ఎంపీ కోటిరెడ్డి వెంకట్‌రెడ్డిని శుక్రవారం కలిశారు. ఆయన నేతృత్వంలో జిట్టా శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. నకిరేకల్ నియోజకవర్గం నుంచి వేముల వీరేశం చేరేందుకు రంగం సిద్ధమైంది. ఆయన ఈ నెల 20న హస్తం గూటికి చేరనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వీరిద్దరికి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించగా, మరికొంత మంది ఆశావహులు కూడా కాంగ్రెస్ కండువా వేసుకునేందుకు రెడీ అవుతున్నట్లు తెలిసింది.

నేడో, రేపో అనుకున్నా..

బీఆర్‌ఎస్ నాయకుడు, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని ముందుగా అనుకున్న ప్రకారం 16 లేదా 17వ తేదీన చేర్చుకునేలా కాంగ్రెస్ పార్టీ రంగం సిద్ధం చేసింది. అయితే, 17న హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ సభ ఉండటం.. ఆ సభకు సోనియాగాంధీ హాజరవుతుండడంతో హడావుడి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో వీరేశం చేరిక వాయిదా వేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రస్తుతం కుదరకపోతే.. 20వ తేదీన వీరేశంను చేర్చుకునేలా పార్టీ పెద్దలు ముహూర్తం ఖరారు చేశారు. ఢిల్లీలో సోనియాగాంధీ సమక్షంలోనే వీరేశం పార్టీలో చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర నేతలు వీరేశంతోనూ చర్చించారు. 17వ తేదీ నాటికి సభకు వీరేశం కూడా పెద్ద ఎత్తున జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని నార్కట్‌పల్లి, రామన్నపేటతోపాటు ఇతర మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లేలా రవాణా ఏర్పాట్లపై వీరేశం సమావేశాలు నిర్వహించారు.

అందరి అంగీకారంతో..

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఈసారి తనకు టికెట్ వస్తుందని వేముల వీరేశం ఆశించారు. అయితే, సీఎం కేసీఆర్ సిట్టింగ్‌లకే టికెట్లు ప్రకటించారు. నకిరేకల్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యనే పోటీలో ఉంటారని ప్రకటించడంతో వేముల వీరేశం అసంతృప్తితో ఉన్నారు. ఆయన చివరకు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆయన బీఆర్‌ఎస్ నుంచి బయటకు వెళ్లకుండా, పార్టీ మారకుండా ఉండేందుకు బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. వీరేశం చేరికపై భువనగిరి ఎంపీ కోటిరెడ్డి వెంకట్‌రెడ్డి మొదట్లో సుముఖత వ్యక్తం చేయకపోవడంతో చేరిక ఆలస్యమైంది. తాజాగా కోమటిరెడ్డి నుంచి కూడా గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో 20వ తేదీన వీరేశం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నేడు కాంగ్రెస్‌లో చేరనున్న 'జిట్టా'

భువనగిరి నియోజకవర్గానికి చెందిన జిట్టా బాలకృష్ణారెడ్డి శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. మొన్నటివరకు బీజేపీలో ఉన్న ఆయనను బీజేపీ ఇటీవల సస్పెండ్ చేసింది. దీంతో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతున్నారు. ఇందులో బాగంగానే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో చర్చించారు. కోమటిరెడ్డి నివాసంలోనే శనివారం జిట్టా బాలకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు.

భూ నిర్వాసితులకు అండగా ఉంటా



మంత్రి జగదీష్‌రెడ్డి వద్ద తమ గోడు వెల్లబోసుకుంటున్న లక్ష్మాపురం భూ నిర్వాసితులు

- విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

నాంపల్లి : కిష్టరాయినిపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న లక్ష్మాపురం భూ నిర్వాసితులకు అండగా ఉండి పరిహారం అందేలా కృషి చేస్తానని మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి భరోసా కల్పించారు. శుక్రవారం నాంపల్లి మండలానికి చెందిన లక్ష్మాపురం భూ నిర్వాసితులు రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సూర్యాపేటలో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులో భూమి కోల్పోతున్న ప్రతి ఒక్కరికి పరిహారం అందజేయడంతోపాటు పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి నిర్వాసితులకు వెంటనే పరిహారం అందించాలని ఆదేశించారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

నల్లగొండ రూరల్ : ప్రభుత్వంలో విలీనం చేసే కంటే ముందే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు శుక్రవారం నల్లగొండ డిపో ఎదుట నిరసన తెలిపారు. 2017, 2021 పెండింగ్ పేస్కేల్‌ను, 2013 ఏరియర్స్ బాండ్‌ను వడ్డీతో సహా ఇవ్వాలని, 9 డీఏల ఏరియర్స్ చెల్లించాలని, సీసీఎస్‌కు ఇవ్వాల్సిన డబ్బు వడ్డీతో సహా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎస్‌ఆర్‌సీ రాజు, నర్సింహ, స్వామి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రశాంతంగా టెట్



చిట్యాలలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్



మిర్యాలగూడలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, డీఈఓ

నల్లగొండ : జిల్లాలో టెట్ ప్రశాంతంగా సాగింది. మిర్యాలగూలోని ఓ కేంద్రంలో మాల్ ప్రాక్టీస్ ఘటన చోటు చేసుకుంది. శుక్రవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన టెట్‌కు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో గైర్హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన టెట్ పేపర్–1ను 52 కేంద్రాల్లో నిర్వహించారు. మొత్తం 12,423 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 9,614 మంది హాజరయ్యారు. 2,809 మంది గైర్హాజరయ్యారు. 77.39 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం జరిగిన పేపర్–2కు 49 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 11,399 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 10,125 మంది హాజరయ్యారు. 1274 మంది గైర్హాజరయ్యారు. 88.82 శాతం హాజరు నమోదైంది. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ చిట్యాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. డీఈఓ ఎనిమిది పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా స్థాయి అధికారులు ఏడు కేంద్రాల్లో పరీక్ష తీరును పరిశీలించారు. ఉదయం జరిగిన పేపర్–1లో మిర్యాలగూడలోని కృష్ణవేణి హైస్కూల్ సెంటర్‌లో మాల్ ప్రాక్టీస్ ఘటనలో ఒక ఇన్విజిలేటర్, ఒక అభ్యర్థిపై కేసు నమోదైంది. మాల్ ప్రాక్టీస్‌కు సహకరించిన ఇన్విజిలేటర్ అయిన పంచాయతీ కార్యదర్శిపై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.

పీఎఫ్ కార్యాలయం ఎదుట పెన్షనర్ల నిరసన



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు, ఉద్యోగులు

నల్లగొండ టూటౌన్ : పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎఫ్ ఆర్‌డీఏ చట్టం ప్రకారం ఈపీఎస్, ఎన్‌పీఎస్ పెన్షనర్లు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టాన్ని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్దన్, జిల్లా కోశాధికారి ఎండీ.అబ్దుల్ ఖాదర్, డివిజన్ గౌరవాధ్యక్షుడు గుండాల భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో 'ఆయుష్మాన్ భవ'

- ఆరోగ్య మేళాలు, యోగా, రక్తదాన శిబిరాల నిర్వహణ
- ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు, మందుల పంపిణీ
- రేపటి నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమం



నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ మహాత్మాగాంధీ జయంతి రోజు వరకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య మేళా, యోగా, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నారు. జిల్లాలోని జీజీహెచ్, ఏరియా ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్‌లు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లు, పల్లె, బస్తీ దవాఖానాలు కలుపుకుని మొత్తం 260 కేంద్రాల్లో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అన్ని కేంద్రాల్లో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.

అన్ని రకాల వైద్య పరీక్షలు

ఆయుష్మా భవ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసే శిబిరాల్లో బీపీ, మధుమేహం, ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ కాన్సర్‌లకు సంబంధించిన స్కీనింగ్ టెస్ట్‌లు చేయనున్నారు. టీబీ, లెప్రసీ, ఇతర అన్ని రకాల పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ కేంద్రాలకు వచ్చే వారికి 57 రకాల ఆరోగ్య పరీక్షలను తెలంగాణ డయాగ్నొస్టిక్‌లో నిర్వహించి 24 గంటల్లో రిపోర్ట్‌లను రోగితో పాటు ఆయా కేంద్రాల డాక్టర్లుకు అందజేయనున్నారు. ఆయా పరీక్షల రిపోర్టుల ఆధారంగా వైద్యులు వారికి అవసరమైన వైద్యం అందించంతో పాటుగా ఉచితంగా మందులను కూడా ఇవ్వనున్నారు. అవసరమైతే స్పెషలిస్టు వైద్యులతో టెలీ కాన్ఫరెన్స్ సేవలను అందించనున్నారు. ఆయా కేంద్రాల్లో అందించలేని వైద్య సేవల కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్యం అందించేలా చూడనున్నారు. జిల్లాలోని 260 కేంద్రాల్లో ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది కాకుండా అవసరమైతే ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను వినియోగించుకోనున్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఈ నెల 17నుంచి కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే మెగా హెల్త్ మేళాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. వివిధ రకాల వైద్య పరీక్షలను పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తాం. అన్ని రకాల జబ్బులకు ఉచితంగా మందులు అందజేస్తాం. రక్తదాన శిబిరాల్లో యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావాలి.
– డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

అక్టోబర్ 2న రక్తదాన శిబిరాలు

రకరకాల జబ్బులతో బాధపడుతున్న వారు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలపై ఆరోగ్య శిబిరాల్లో అవగాహన కల్పించనున్నారు. దాంతో పాటు యోగా శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రస్తుతం వస్తున్న రోగాల నుంచి రక్షణ పొందడానికి అవసరమైన జీవన విధానాన్ని వివరించనున్నారు. అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంతో పాటుగా అన్ని ప్రధాన పట్టణాల్లో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నారు. రక్తదాన కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛద సంస్థలు, ఇతర సామాజిక సేవా సంఘాలను భాగస్వాములను చేసి రక్తాన్ని సేకరించనున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్
- డాక్టర్లు, ఎంపీడీఓలతో సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

నల్లగొండ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్లు, ఎంపీడీఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డెంగీ కేసులు నమోదవుతున్నందున వైద్యాధికారులు అప్రమత్తమతంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన చికిత్స అందించడంతోపాటు దోమల నివారణకు పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు. అన్ని బస్తీ దవాఖానాల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు కిట్లను సిద్ధం చేశామన్నారు. డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో ఫీవర్ సర్వే చేయడం, దోమల నివారణకు ఎంటమాలజీ విభాగంతో పాటు మున్సిపల్, పంచాయతీ సిబ్బందితో కలిసి యాంటీ లార్వా, ఫాగింగ్, డ్రైడే వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఎంపీఓలు, డాక్టర్లు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద మహిళలకు మాస్టర్ చెకప్‌లో భాగంగా ఎనిమిది రకాల టెస్టులను చేసి రిపోర్టులను అందజేయాలన్నారు. ఏఎన్‌ఎంలు, సీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి మహిళలను ఆరోగ్య మహిళా క్యాంపులకు తరలించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాత్రు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజకుమారి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో ఘనంగా ఇంజనీర్స్ డే

నాగార్జునసాగర్ : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని నాగార్జునసాగర్ ప్రాజెక్టు సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఇంజనీర్స్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ నాగేశ్వర్ రావు, ఈఈ మల్లికార్జున్, డీఈలు సుదర్శన్, పరమేశ్, ఏఈలు కృష్ణయ్య, సత్యనారాయణ, భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ సర్కిల్ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న ఇంజనీర్లు

మునుగోడును రెవెన్యూ డివిజన్ చేయాలి



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న మునుగోడు మండల ప్రజాప్రతినిధులు

మునుగోడు : మునుగోడును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో పాటు మున్సిపాలిటీ కేంద్రంగా మార్చాలని మండలంలోని ప్రజా ప్రతినిధులు అంతా శుక్రవారం కలెక్టరేట్‌లకు వెళ్లి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌ను కలిశారు. ప్రస్తుతం ప్రకటించినా చండూరు రెవెన్యూ డివిజన్‌లో మునుగోడును కలపొద్దని, ఇప్పటిలాగే నల్లగొండ డివిజన్‌లో కొనసాగించాలని కోరారు. మండలంలో నెలకొన్న తొమ్మిది ప్రధాన సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. మునుగోడులో 30 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మించాలని విన్నవించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నారబోయిన స్వరూపారాణి రవి, వైస్ ఎంపీపీ అనంత వీణలింగస్వామి, సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, జాల వెంకన్నయాదవ్, తాటికొండ సంతోషసైదులు, జక్కలి శ్రీను, చెల్లమల్ల వెంకట్‌రెడ్డి, నందిపాటి రాధారమేష్, సురిగి చలపతి, పగిళ్ల భిక్షం, పల్లెబోయిన యాదయ్య, నకరెకంటి పద్మయాదయ్య, బొజ్జ సుజాతశ్రీను, ఎంపీటీసీలు సైదులు, చెర్కు కృష్ణయ్య, వనం యాదయ్య, నాయకులు నాగరాజు, విజయ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నల్లగొండ : గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. ఇంకా పనులు ప్రారంభించని భవన నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ఉపాధి హామీ పనుల విషయంలో వెంటనే రికవరీ చేసేలా ఎంపీడీఓలు, ఏపీఓలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఓరుగంటి రాములు సంతాప సభ

- హాజరుకానున్న గవర్నర్ బండారు దత్తాత్రేయ



ఓరుగంటి రాములు(ఫైల్)

నల్లగొండ టూటౌన్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బీజేపీ సీనియర్ నేత ఓరుగంటి రాములు సంతాప సభ శనివారం నల్లగొండ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్‌లో కుటుంబ సభ్యులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరు కానున్నట్లు ఓరుగంటి రాములు కుటుంబ సభ్యులు తెలిపారు.

కాపర్ వైరు చోరీ

మునగాల: గుర్తుతెలియని వ్యక్తులు మునగాల శివారులో ఎన్‌ఎస్పీ ప్రధాన గేట్ల బేరింగ్‌లలో ఉన్న కాపర్ వైరును గురువారం రాత్రి చోరీ చేశారు. ఎన్‌ఎస్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఎడమకాలువ వద్ద ముక్త్యాల బ్రాంచి కాలువపై ఏర్పాటు చేసిన గేట్లపైన అమర్చిన రెండు పెద్ద సైజు బేరింగులను ఊడదీసి సుమారు రూ.రెండు లక్షల విలువ గల కాపర్ వైరును అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఎన్‌ఎస్పీ సిబ్బంది శుక్రవారం మునగాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఇదే ఎడమకాలువపై 15రోజుల క్రితం మునగాల శివారులో ఉన్న ఎస్కేప్ తలుపులకు సంబంధించిన నాలుగు బేరింగ్‌లలోని కాపర్‌వైర్ చోరీకి గురైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీని విలువ సుమారు రూ.నాలుగు లక్షలు ఉంటుందని అంచనా. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

విద్యార్థిని గాయపర్చిన ఉపాధ్యాయుడు



గాయపడిన విద్యార్థి

తుంగతుర్తి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో శుక్రవారం ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు గాయపరిచాడు. తుంగతుర్తిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో కోదాడకు చెందిన షేక్ సిరాజ్ ఆరవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో గురువారం నైట్ డ్యూటీలో ఉన్న ఉపాధ్యాయుడు శుక్రవారం ఉదయం విద్యార్థులను నిద్రలేపే క్రమంలో సిరాజ్ తలపై ఇనుప చువ్వతో కొట్టాడు. దీంతో విద్యార్థి తలకు గాయమైంది. తోటి ఉపాధ్యాయులు ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ ఉమారెడ్డికి తెలిపి విద్యార్థిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రిన్సిపాల్ ఉమారెడ్డి వివరణ కోరగా.. విద్యార్థి గాయపడిన సంఘటనపై గురుకుల పాఠశాల ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

గిరిజన బాలికల హాస్టల్‌లో అధికారుల విచారణ



హాస్టల్‌లో వంటలను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని ఖమ్మం రోడ్డులో గల గిరిజన బాలికల హాస్టల్‌లో విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై శుక్రవారం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, ఏసీఎంఓ డివి నాయక్ విచారణ జరిపారు. హాస్టల్ విద్యార్థినులను తరగతుల వారీగా పిలిచి అస్వస్థతకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అపెండెక్స్‌తో ఒకరికి కడుపు నొప్పి రాగానే మిగతా విద్యార్థినులు భయాందోళనకు గురైనట్లు రాజ్‌కుమార్ తెలిపారు. త్వరలో హాస్టళ్లలో ఏఎన్‌ఎం అందుబాటులో ఉండే విధంగా చూస్తామన్నారు. అనంతరం వంటలను పరిశీలించారు. వారి వెంట వార్డెన్ అహల్య తదితరులున్నారు.

- ఆలస్యంగా అభ్యర్థులు.. అనుమతి నిరాకరణ



భువనగిరి మదర్ థెరిస్సా స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రానికి తాళం వేయడంతో గేటు బయటే నిల్చున్న అభ్యర్థులు



భువనగిరిలోని జాగృతి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులు

- పరీక్ష కేంద్రం ఎదుట కిటకిట



భువనగిరి పట్టణంలోని జాగృతి డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రం ఎదుట వేచి ఉన్న అభ్యర్థులు

విధులు ముగించుకుని వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి దుర్మరణం
- మరో టీచర్‌కు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం



ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయులు

సూర్యాపేట రూరల్ : విధులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని కారు రూపంలో మృత్యువు కబళించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.సూర్యాపేట మండల పరిధిలోని ఎర్కారం గ్రామ సమీపంలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అర్వపల్లి మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన సైరెడ్డి మల్లారెడ్డి (55) ఉక్కు వెంకన్న అర్వపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరిద్దరూ సూర్యాపేట పట్టణంలో నివాసం ఉంటున్నారు. రోజువారీగా ఒకే బైక్‌పై అర్వపల్లిలోని పాఠశాలకు వెళ్లి తిరిగి సూర్యాపేట వస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం పాఠశాల నుంచి సూర్యాపేటకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. సూర్యాపేట–జనగాం రహదారిపై ఎర్కారం గ్రామ సమీపంలోని రేఖ్యానాయక్ తండా వద్ద ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మల్లారెడ్డి చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంకన్న పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

కట్టుకున్నోడే కాలయముడు

- వీడిన గర్భిణి అనుమానాస్పద మృతి కేసు మిస్టరీ
- క్షణికావేశం, కుటుంబ కలహాలతోనే ఘాతుకం
- నిందితుడి అరెస్ట్, రిమాండ్

మర్రిగూడ : మర్రిగూడ మండలం అజ్జలాపురంలో ఇటీవల వెలుగుచూసిన గర్భిణి అనుమానాస్పద మృతి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. కుటుంబ కలహాలు, క్షణికావేశంతో భర్తే ఆమెను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అరెస్ట్ చేసిన నిందితుడిని శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియా ఎదుట ప్రవేశపెట్టి ఎస్‌ఐ రంగారెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. మర్రిగూడ మండలం కమ్మగూడేనికి చెందిన సుష్మిత, అజ్జలాపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్ ప్రేమించుకుని ఈ ఏడాది జనవరిలో వివాహం చేసుకున్నారు. సుష్మిత ప్రస్తుతం ఏడు నెలల గర్భవతి. దంపతుల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు ఏర్పడి గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో ఈ నెల 10వ తేదీన రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. క్షణికావేశానికి గురైన శ్రీకాంత్ దిండుతో సుష్మితను అదిమిపట్టి ఊపిరి ఆడనీయకుండా చేశాడు. అనంతరం మాల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ తర్వాత సుష్మిత మృతదేహాన్ని మర్రిగూడ ఆస్పత్రికి తీసుకొచ్చి అనారోగ్య కారణాలతో మృతిచెందినట్లు చిత్రీకరించాడు. మృతురాలి సోదరి శ్రీకాంత్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. కుటుంబ కలహాలు, క్షణికావేశంలోనే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన దేవరకొండ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ వివరించారు.

పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం



అభిలాష్ (ఫైల్)

మర్రిగూడ : పురుగుల మందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మర్రిగూడ మండల పరిధిలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మర్రిగూడ మండలం సరంపేట గ్రామానికి చెందిన దామెర అభిలాష్(35) కొంతకాలంగా కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం నల్లగొండ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున అభిలాష్ మృతిచెందాడు. అభిలాష్‌కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి బావిలో విగతజీవుడై..

- ఆత్మహత్యగా పోలీసుల ప్రాథమిక నిర్ధారణ



పరుశరామ్ (ఫైల్)

రాజాపేట : అదృశ్యమైన వ్యక్తి వ్యవసాయ బావిలో విగతజీవుడై కనిపించాడు. రాజాపేట మండల పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా, మరుకుక్ మండలం, పాములపర్తికి చెందిన లావణ్య తన భర్త పరుశరామ్ (35)తో కలిసి ఇటీవల రాఖీ పండుగకు రాజాపేట మండలంలోని సింగారంలో ఉంటున్న పుట్టింటికి వచ్చింది. పరుశరామ్ అనారోగ్యానికి గురికావడంతో కొద్ది రోజులుగా అక్కడే ఉంటోంది. ఈ నెల 10వ తేదీన పరుశరామ్ అత్తింటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో లావణ్య మరుసటి రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గురువారం రాత్రి సింగారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికి తీయించిన పోలీసులు చనిపోయిన వ్యక్తి పరుశరామ్‌గా అతడి కుటుంబ సభ్యుల ద్వారా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరుశరామ్‌కు డిపోకల్లు తాగే అలవాటు ఉందని, అది ఇక్కడ లభించకపోవడంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన రిటైర్డ్ టీచర్ మృతి

నకిరేకల్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విశ్రాంత ఉపాధ్యాయుడు మృతిచెందాడు. నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన వద్ది లక్ష్మీనారయణ(65) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి విరమణ పొందారు. లక్ష్మీనారాయణ నాలుగు నెలల క్రితం బైక్‌పై నకిరేకల్ నుంచి చందుపట్ల గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో చీమలగడ్డ ఫ్లైఓవర్ కింద ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సుధీర్ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు..

కేతేపల్లి: ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న వాహనాలను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటన జాతీయ రహదారిపై కేతేపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కేతేపల్లిలోని మూసీ గ్యాంగ్ క్వార్టర్స్ సమీపంలోకి చేరుకోగానే ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి ముందు వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ ప్రయాణికులు, ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. బస్సు ఏ మాత్రం ముందుకెళ్లినా రోడ్డు పక్కనే ఉన్న నీటి గుంటలో బోల్తా కొట్టేది. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన తర్వాత బస్సు అక్కడే నిలిచి పోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని కేతేపల్లి పోలీసులు తెలిపారు.

పురుగు మందుల పిచికారీలో జాగ్రత్తలు

- నడిగూడెం ఏఓ రాజగోపాలరావు



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు



రాజగోపాలరావు, ఏఓ, నడిగూడెం

పాడి పంట

నడిగూడెం : వాణిజ్య పంటలతో పాటు ఇతర పంటలపై కూడా ఈ మధ్యకాలంలో రసాయన మందుల వాడకం గణనీయంగా పెరిగింది. వివిధ రకాల పురుగులు, తెగుళ్లను నివారించేందుకు రైతులు ప్రమాదకరమైన మందులను ఆశ్రయిస్తున్నారు. పంట కాలంలో ఆరు నుంచి పదిసార్లు రసాయన మందులను పిచికారీ చేయడం ఆందోళనకరం. వాడే పద్ధతి తెలియకపోవడం, కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో పలువురు రైతులు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. మరికొందరు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రస్తుతం రసాయన మందుల పిచికారీలో తగిన జాగ్రత్తలు పాటించాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు చెబుతున్న జాగ్రత్తలు ఆయన మాటల్లోనే.. రైతులు రసాయన మందుల పిచికారీని తేలికగా తీసుకుంటున్నారు. అదుపు తప్పితే పురుగుకు కాదు మనిషికి ప్రాణాపాయమని గుర్తించడంలేదు. మిరప, వరి, పత్తి పంటలకు తెగుళ్ల తీవ్రతను బట్టి ప్రమాదకరమైన రసాయనాలను వాడుతున్నారు. పిచికారీ సమయంలో కనీస జాగ్రత్తలు పాటించడం లేదు. మందులు కలిపే సమయంలో ఎటువంటి తొడుగులు ఉపయోగించకుండా చేతితో లేదా కర్రలను ఉపయోగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో 14 ఏళ్ల లోపు పిల్లలు కూడా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. పిచికారీ చేసిన తర్వాత భోజనాలు, నీళ్ల తాగడం, పొగతాగడం సాధారణంగా మారింది. ఆ మందు డబ్బాలను ఇళ్లల్లో నిత్యం నీటి నిల్వకు వాడుకుంటున్నారు.

ఇవి తప్పనిసరి..

- పిచికారీ ముందు వ్యక్తి తప్పనిసరిగా ముక్కు, కళ్లకు మందు తాకకుండా శిరస్త్రాణం లాంటిది తప్పనిసరిగా ధరించాలి.
- మందును ట్యాంకుల్లో కలుపుకునే సమయంలో చేతులకు తొడుగులు ఉపయోగించాలి.
- పిచికారీ సమయంలో నీళ్ల తాగడం, బీడీ, సిగరెట్ లాంటివి, పొగపీల్చడం తినడం వంటివి చేయరాదు.
- పిచికారీ అనంతరం పరిశుభ్రంగా స్నానం చేసుకున్న తర్వాతే ఆహార పదార్థాలు తినాలి.
- మందును గాలి వీచే వ్యతిరేక దిశలో పిచికారీ చేయరాదు.
- సాధ్యమైనంతవరకు గాలి, ఎండ ఉన్న సమయంలోనే పిచికారీ చేయడం మంచిది.
- పురుగు మందు పిచికారీపై రైతులకు అవగాహన ఉండాలి.
- కొన్ని రకాల రసాయన మందులు రెండు నుంచి మూడు కలిపి పిచికారీ చేయడం చాలా ప్రమాదకరం.
- రైతులు ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

- పిచికారీ సమయంలో రసాయనిక మందుల ప్రభావం ఊపిరితిత్తుల నుంచి నేరుగా మెదడుకు వెళ్లిపోతుంది. ప్రాథమిక చికిత్సకు అవకాశాలు తక్కువగా ఉంటాయి. అత్యవసర చికిత్సయే శరణ్యమవుతుంది. రైతులు పూర్తిస్థాయి దుస్తులు ధరించి పురుగు మందులు పిచికారీ చేయడం ఉత్తమం.

రైలు నుంచి జారిపడి మహిళ దుర్మరణం

భువనగిరి: భువనగిరి మండల పరిధిలో శుక్రవారం రైలు నుంచి జారిపడి మహిళ మృతిచెందింది. పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన నాజీరా బీబీషేక్ (30) భర్త సికింద్రాబాద్‌లో ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. బీబీషేక్ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఫలక్‌నూమా రైలులో ప్రయాణం చేస్తోంది. ఈ క్రమంలో నందనం– అనాజీపురం గ్రామాల మధ్య ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి మృతి చెందింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రైల్వే హెడ్ కానిస్టేబుల్ రజిత తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



ఇందిరమ్మ మృతదేహం

చింతపల్లి : పురుగుల మందు తాగిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన జంగిటి ఇందిరమ్మ (35) భర్త రామ్మోహన్ ఇద్దరు కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నసర్లపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద వారికున్న ప్లాటు (ఖాళీ స్థలం)ను కొంతకాలం క్రితం అదే గ్రామానికి చెందిన బంధువులకు విక్రయించారు. ప్లాట్ విషయమై ఇరు కుటుంబాల మధ్య నెల రోజుల కిందట తగాదా చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గురైన ఇందిరమ్మ ఇంట్లో ఉన్న వరి చేను కలుపుతీత మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించగా నెల రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఇందిరమ్మ మృతికి బంధువులే కారణమని ఆరోపిస్తూ శుక్రవారం మృతదేహాన్ని వారి ఇంట్లో వేసి ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీశ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పినప్పటికీ ఆందోళనకారులు న్యాయం కావాలని భీష్మించారు. రాత్రి వరకు ఆందోళన కొనసాగుతూనే ఉంది. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు కాగా ఇద్దరు వివాహాలు జరిగాయి. మృతురాలి భర్త రామ్మోహన్ ఈ విషయమై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

నేరేడుచర్ల : గుర్తుతెలియని వ్యక్తి మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించుకుపోయాడు. ఈ ఘటన నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో చోటు చేసుకుంది. మేడారం గ్రామానికి చెందిన నెమిలితోక సాడమ్మ గురువారం రాత్రి ఇంట్లో ఒంటరిగా నిద్రించింది. శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తి ప్రవేశించి సాడమ్మ మెడలోని రెండు తులాల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. బాధితురాలి నిద్రలోంచి లేచి కేకలు వేయడంతో దుండగుడు కనిపించకుండాపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



బొమ్మలరామారం : ఆధారాలు సేకరిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది

బొమ్మలరామారం : దుండగులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామ సర్పంచ్ యంజాల కళ భర్త సత్యనారయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఇంటిని వదిలి వేయాల్సి రావడంతో 20 రోజులుగా సర్పంచ్ కళ అత్తవారి ఇంటి వద్ద నివాసం ఉంటుంది. పాత ఇంటి వైపు శుక్రవారం వెళ్లి చూడగా తాళం విరగ్గొట్టి ఉండడాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూసింది. బీరువాలోని బట్టలు ఇతర వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతో పాటు అందులోని 3 తులాల బంగారు, 40 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి సంఘటన పరిశీలించి, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

చీరలను అపహరిస్తూ చిక్కిన కి‘లేడి’



సీసీ ఫుటేజీలో రికార్డయిన చీరల చోరీ దృశ్యం

భూదాన్‌పోచంపల్లి : గుట్టుచప్పుడు కాకుండా చీరలను అపహరించిన మహిళను పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాధితుడు ధనుంజయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలోని సుష్మ మ్యాచింగ్ సెంటర్‌కు వచ్చిన గుర్తు తెలియని మహిళ చీరలు కావాలని చూపించమని కోరింది. ఆమెకు చీరలు చూపిస్తుండగానే గిరాకీ రావడంతో యజమాని వారితో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని మహిళ రెండు చీరలను దొంగలించి బయటికి వెళ్లిపోయింది. కొద్దీ దూరం వచ్చి లోదుస్తుల్లో దాచిన చీరలను బయటికి తీసి కవర్‌లో వేస్తుండగా సమీపంలో ఉన్న ఓ వ్యక్తి గమనించి షాపు యజమానికి సమాచారం ఇచ్చాడు. గషాపులో ఉన్న సీసీ కెమెరాలో సీసీ ఫుటేజీని పరిశీలించగా అందులో చీరలు దొంగిలిస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన షాపు యజమాని ఆమెకోసం వెతుకుతుండగా స్థానిక మార్కండేయ దేవాలయం వద్ద కన్పించింది. పట్టుకొని ప్రశ్నించగా అమె పొంతన లేని సమాధానాలు చెప్పింది. దాంతో ఆమెను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అయితే పోలీసుల విచారణలో పట్టుబడిన మహిళ పేరు చేకూరి సునిత అని, తనది దిల్‌సుఖ్‌నగర్ అని చెబుతుంది. ఉదయం నుంచి చీరలు కావాలని, జాకెట్లు కుడుతారా అని పలు షాపుల్లో తిరిగినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఆరు నెలల క్రితం పట్టణ కేంద్రంలోని ఓ షాపులో చీరలు దొంగతనం కేసులో ఈమె పాత్ర ఉండవచ్చునని అనుమానిస్తున్నారు.

మృత్యువుతో పోరాడి ఓడిన అముద

క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతూ మృతి


అముద (ఫైల్)

కోదాడ: క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న అముద అనే అభాగ్యురాలు చివరకు ఓడిపోయింది. ఆరు నెలలుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. తమిళనాడులో పుట్టి పెరిగిన అముద నారాయణ నాడార్(40) మతిస్థిమితం కోల్పోయి 15 ఏళ్ల క్రితం సూర్యాపేట జిల్లా కోదాడకు చేరుకుంది. మున్సిపాలిటీ చెత్తకుప్పల్లో ఆహారాన్ని వెతుక్కుంటుండగా పల్లా వెంకటేశ్వర్లు అనే స్థానికుడి కంటపడింది. ఆమెను వెంకటేశ్వర్లు చేరదీసి ఆదరించాడు. దాతలు, మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ రఘురామిరెడ్డి సాయంతో మంచిమనిషిగా మార్చాడు. కొంతకాలం విద్యావలంటీర్‌గా పనిచేసింది. కోదాడ వ్యవసాయ మార్కెట్‌లో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్న క్రమంలో ఆరునెలల క్రితం ఆమె అనారోగ్యం బారిన పడింది. వైద్యులు పరీక్షించి క్యాన్సర్ అని తేల్చారు. వెంకటేశ్వర్లు ఆమెను హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. వ్యాధి ముదరడంతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ శుక్రవారం కోదాడలోని వెంకటేశ్వర్లు ఇంట్లోనే కన్నుమూసింది.

అడుగడుగునా అండగా నిలిచిన 'సాక్షి'

చెత్తకుప్పల మధ్య ఉన్న అముదను వెంకటేశ్వర్లు ఆదరించిన వైనాన్ని, ఆ తర్వాత మంచిమనిషిగా మారిన అముద గురించి పలు సందర్భాల్లో 'సాక్షి'కథనాలు ప్రచురించింది. అముద జీవిత చరిత్రను టెలిఫిల్మ్‌గా తీసిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. అముదకు క్యాన్సర్ సోకిన విషయాన్ని 'అయ్యో అముద'శీర్షికన కథనం ప్రచురించడంతో దాతలు ముందుకొచ్చి సాయం కూడా అందించారు.

మూడు 'రియల్' సంస్థలకు రూ. 50 లక్షల జరిమానా

సాక్షి, హైదరాబాద్: జయత్రి(జయ గ్రూపు) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఏజీఎస్ శ్రీనివాసం ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఈఏపీఎల్ సంస్థలు నిబంధనలు ఉల్లంఘించి పత్రికలు, టీవీల్లో ప్రకటనలు ఇవ్వడమేకాక, మార్కెటింగ్ నిర్వహించడంపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) కన్నెర్ర చేసింది. ఈ సంస్థలపై రూ. 50 లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం రెరా చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.


ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఏజెన్సీకి వైద్యాధికారులు

'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

సాక్షిప్రతినిధి, వరంగల్: ఏజెన్సీలో ప్రబలుతున్న విషజ్వరాలపై శుక్రవారం 'సాక్షి' ప్రధాన సంచికలో 'ఏజెన్సీకి ఫీవర్' శీర్షికన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలకేంద్రంతోపాటు అటవీ గ్రామాలైన సింగారం, పోలారం ప్రేమ్‌నగర్ తండాల్లో మండల వైద్యాధికారి సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల బారిన పడిన వారి వివరాలు సేకరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెంలో వైద్యశిబిరం నిర్వహించి 100మందికి మందుల కిట్ అందజేశారు. వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ అప్పయ్య సందర్శించి రోగులను పరీక్షించారు. తాడ్వాయి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మేడారం, గంగారం గ్రామాల్లో, కొడిశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎల్బాక, పడిగాపూర్ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మంగపేట మండలంలోని నర్సింహాసాగర్, అకినేపల్లిమల్లారంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రక్త నమూనాలు సేకరించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

అజ్ఞాతం వీడండి

- మావోయిస్టులకు డీజీపీ అంజనీకుమార్ పిలుపు
- కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావు అరెస్టు


మీడియాతో మాట్లాడుతున్న డీజీపీ. చిత్రంలో సంజోయ్ దీపక్‌రావు

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణకు చెందిన అగ్రనేతలు, కేడర్ అజ్ఞాతం వీడి పోలీసులకు లొంగిపోవాలని డీజీపీ అంజనీకుమార్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులు అజ్ఞాతం వీడి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సంజోయ్ దీపక్‌రావును శుక్రవారం ఉదయం కూకట్‌పల్లిలోని మలేషియన్ టౌన్‌షిప్‌లో అరెస్టు చేసినట్టు డీజీపీ తెలిపారు. నాలుగు రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన దీపక్‌రావు ఛత్తీస్‌గఢ్‌లోని మాడ్ ప్రాంతంలో ఓ మావోయిస్టు సమావేశానికి హాజరుకావాల్సి ఉందని, ఆయన కదలికలపై ఎస్ఐబీ (స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో)కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒక రివాల్వర్, ఆరు లైవ్‌రౌండ్లు(బుల్లెట్లు), రూ.47,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మలేషియన్ టౌన్‌షిప్‌లో ఉండే మహేంద్రటెక్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రంజిత్‌శంకరన్, మాదాపూర్‌కు చెందిన ఓ సినీ దర్శకుడు బి.అజిత్‌కుమార్‌లు దీపక్‌రావుకు ఆశ్రయం ఇచ్చినట్టు గుర్తించామన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కొన్నేళ్లుగా తెలంగాణ నుంచి మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా శూన్యమని, సంజోయ్ దీపక్‌రావు అరెస్టుతో ఆ పార్టీకి ఎదురుదెబ్బ తగిలినట్టయ్యిందన్నారు. దీపక్‌రావు మావోయిస్టు అగ్రనేతలు గణపతి, బస్వరాజ్, కోసాలతో నేరుగా సంబంధాలున్నట్టు తెలిపారు.

నాలుగు రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్

సంజోయ్ దీపక్‌రావు ప్రస్తుతం కేంద్ర కమిటీతోపాటు సౌత్ రీజియన్ బ్యూరో ఇన్‌చార్జ్‌గా, వెస్ట్రన్ ఘాట్ స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఉన్న ఆయన మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల పోలీసులతోపాటు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు మోస్ట్‌వాంటెడ్‌గా ఉన్నారు. దీపక్‌రావుపై మహారాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ఈస్ట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివగంధనగర్‌కు చెందిన సంజయ్ దీపక్‌రావు జమ్మూకశ్మీర్‌లో 1984లో బీటెక్ పూర్తి చేశారు. 1999లో సీపీఐఎంఎల్ రవూఫ్ గ్రూప్‌లో తొలుత చేరారు. నక్సల్‌బరీ గ్రూప్‌నకు మహారాష్ట్ర ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2000లో ఓసారి అరెస్టు, తర్వాత విడుదలై మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లారు. 2002లో అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాల వ్యాప్తికి కీలకంగా పనిచేశారు. 2014లో నక్సల్‌బరీ, సీపీఐ మావోయిస్టులో విలీనం కావడంలో కీలక పాత్ర పోషించారు. నవంబర్ 2021లో పశ్చిమ కనుమల ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి బీజీ కృష్ణమూర్తి అరెస్టు తర్వాత, ఆ జోనల్‌కు ప్రత్యేక జోనల్ కమిటీకి కార్యదర్శిగా నియామకం కాగా, అప్పటి నుంచి అక్కడే పనిచేస్తున్నారు.

మంత్రాల నెపంతో ఇద్దరిపై దాడి


బానోత్ నరేశ్, భాస్కర్‌ను చెట్టుకు కట్టేసిన దృశ్యం

నర్సాపూర్‌రూరల్: మంత్రాల నెపంతో ఇద్దరిని చెట్టుకు కట్టేసి చితకబాదిన ఘటన మెదక్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. నర్సాపూర్ మండలం పాప్యా తండాకు చెందిన బానోత్ లావణ్యకు జ్వరం రావడంతో ఈ నెల 14న నర్సాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న మెదక్ మండలం సంగాయిగుడి తండాకు చెందిన బంధువులు సేనావత్ భాస్కర్, మూడవత్ భాస్కర్ అదేరోజు సాయంత్రం వచ్చి లావణ్య, ఆమె భర్త నరేశ్‌ను పరామర్శించారు. ఈ క్రమంలో వైద్యులు ఆమెను రాత్రి డిశ్చార్జి చేయడంతో అందరూ కలిసి ఇంటికి చేరుకున్నారు. రాత్రి 10గంటల సమయంలో మూత్రవిసర్జన నిమిత్తం బయటికి వచ్చిన భాస్కర్‌ను స్థానికులైన రమావత్ సక్రు, రమావత్ మోహన్ అనుమానించి చెట్టుకు కట్టేసి చితకబాదారు. అరుపులు విని నరేశ్ బయటకు వచ్చి స్థానికులకు నచ్చజెప్పి తీసుకెళ్లాడు. శుక్రవారం ఉదయం మళ్లీ స్థానికులు నరేశ్ ఇంటికి చేరుకున్నారు. తమ ఇంటి చుట్టూ నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉన్నాయంటూ భాస్కర్, నరేశ్‌లను చెట్టుకు కట్టేసి కట్టెలు, రాళ్లతో కొట్టారు. ఈ ఘటనపై బాధితుడి నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సునీతను టైరు సహాయంతో వాగు దాటిస్తున్న గజ ఈతగాళ్లు

టైరును తెప్పలా చేసి.. గర్భిణిని వాగు దాటించి..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ఎలిశెట్టిపల్లి వద్ద ఏటా వర్షాకాలంలో జంపన్నవాగు ప్రవాహంతో బానాజీబంధం, ఎలిశెట్టిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎలిశెట్టిపల్లికి చెందిన దబ్బకట్ల సునీత ఏడు నెలల గర్భిణి. ఆమెకు శుక్రవారం నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అక్కడే ఉన్న కొందరు గజ ఈతగాళ్లు, స్థానికుల సహాయంతో ట్రాక్టర్ వెనుక టైరును తెప్పలా మార్చారు. దానిపై గర్భిణిని కూర్చోబెట్టి వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు పరీక్షలు చేసి సాధారణమైన నొప్పులేనని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వాగుపై వంతెన నిర్మిస్తే తమ కష్టాలు తొలగిపోతాయని, ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో తాత్కాలిక బోటు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల్లో కొత్త కొలువులు!

- మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో 3,989 హెల్పర్ పోస్టులకు చాన్స్
- కసరత్తు చేస్తున్న మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ

సాక్షి, హైదరాబాద్: మినీకేంద్రాల స్థాయి పెంచి ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్త కొలువులకు అవకాశం ఏర్పడింది. రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 31,711 కేంద్రాలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు కాగా, 3,989 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక టీచర్, ఒక హెల్పర్ ఉంటే.. మినీకేంద్రాల్లో మాత్రం ఒక టీచర్ ఉంటారు. ఇక్కడ హెల్పర్ ఉండరు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రేడ్‌తో అక్కడ హెల్పర్ పోస్టు అనివార్యమైంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖకు అప్‌గ్రేడ్ వివరాలు పంపింది. ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చడంతో వాటికి కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ కూడా పెరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే కొత్తగా హెల్పర్ల నియామకం చేపట్టొచ్చు.

టీచర్ల భర్తీ తర్వాతే...

రాష్ట్రవ్యాప్తంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన రిటైర్మెంట్ పాలసీతో దాదాపు రెండున్నర వేలమంది టీచర్లు పదవీ విరమణ పొందాల్సి ఉంది. ఈక్రమంలో అన్ని రకాల్లో కలిపి నాలుగువేల వరకు పోస్టులు ఖాళీగా ఉంటాయి. అయితే కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోటిఫికేషన్లు జారీ చేసి, భర్తీ ప్రక్రియ ప్రారంభించింది. అయితే వివిధ కారణాలతో ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. తాజాగా మినీ కేంద్రాల అప్‌గ్రెడేషన్‌తో హెల్పర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా, అంతకుముందే అంగన్‌వాడీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈమేరకు జిల్లాల వారీగా ఖాళీల వివరాలతో కూడిన ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ జిల్లా సంక్షేమాధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలకు అనుగుణంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

జిల్లా వార్తలు

నంది అవార్డుకు ఎంపికైన శివలీల



కనగల్: మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యురాలు, సామాజిక కార్యకర్త, జనమైత్రి ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కంబాల శివలీల కాకతీయ నంది పురస్కారానికి ఎంపికయ్యారు. వరంగల్‌లో ఆదివారం కన్నతల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కాకతీయ నంది అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె అవార్డు అందుకోనున్నారు. కాగా.. కరోనా సమయంలో పలు రకాల సామాజిక సేవలు నిర్వహించినందుకు గాను శివలీలకు అబ్దుల్ కలాం అవార్డు, పుడమి రత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మాజ్యోతిబాపూలే, ఉత్తమ మహిళా అవార్డులు దక్కాయి.

యాదాద్రిలో వీహెచ్ పూజలు


వి.హనుమంతరావుకు లడ్డూప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి రాంమోహన్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని మాజీ పీసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు శుక్రవారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకున్న అనంతరం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు పూజలు చేశారు. ఈయనకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదం అందజేశారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాజాపేట: పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని భువనగిరి తపాలా శాఖ ఎస్పీ భూమయ్య కోరారు. శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (డీసీడీపీ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పోస్టాఫీసులో అందుతున్న బ్యాంకు సేవలతోపాటు జీవిత బీమా పాలసీ, ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడెపు ఈశ్వరమ్మ శ్రీశైలం, ఎంపీటీసీ దాచపల్లి రాజు, ఉప సర్పంచ్ రాజేశ్వర్ గుప్త, సబ్ డివిజన్ అధికారి నవీన్, సీనియర్ మేనేజర్ సంతోష్, శ్రీనివాస్, బీపీఎంలు శ్రీను, బాలకృష్ణ, యాదయ్య పాల్గొన్నారు.

రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీదే అధికారం

- నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఆయన సతీమణి పద్మావతి

హుజూర్‌నగర్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతోందని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఇటీవల నిర్మించిన నూతన గృహంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, భోజనాలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో 70 పైచిలుకు అసెంబ్లీ స్థానాల్లో గెలుపొంది అధికారం చేపట్టబోతోందన్నారు. హుజూర్‌నగర్, కోదాడలో కూడా 50 వేల మెజార్టీతో గెలువబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉంటామని పేర్కొన్నారు. ఇప్పుడు జరుగుతున్న అన్ని అరాచకాలకు ఫుల్‌స్టాప్ పెడతామన్నారు. అదే విధంగా దేశంలో పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూడా కాంగ్రెస్ అధిక స్థానాలు గెలుచుకుని రాహుల్‌గాంధీ ప్రధాని కాబోతున్నారని ఆయన తెలిపారు. డిసెంబర్‌లో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి మొదటి అడుగు పడుతుందని ఆయన చెప్పారు. 17న హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టు పక్కన తుక్కుగూడలో దేశచరిత్రలోనే గొప్ప బహిరంగ సభ జరుగబోతుందని ఆయన చెప్పారు. ఈ సభకు కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, భావి ప్రధాని రాహుల్‌గాంధీ, ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే, ప్రియాంకగాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రా సీఎంలు, దేశంలోని కాంగ్రెస్ దిగ్గజాలు అందరూ వస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సభలో సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు అమలు చేయబోయే ఐదు గ్యారంటీలను హామీ ఇవ్వనున్నారని ఆయన చెప్పారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులందరూ అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదులో దేశంలోనే నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం నంబర్‌వన్ స్థానంలో నిలిపినట్లే, 17వ తేదీన జరిగే సభకు జనసమీకరణలో కూడా నంబర్ వన్‌గా నిలవాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లిఖార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి, రాష్ట్ర నాయకులు యరగాని నాగన్న, సాముల శివారెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు, అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి


సీఎం కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్సీ కవిత చిత్రాల మాస్కులు ధరించి ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

భువనగిరిటౌన్ : విద్యాశాఖలో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు భువనగిరిలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్ష శుక్రవారం 15వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ కవిత చిత్రాలతో కూడిన మాస్కులను ముఖానికి ధరించి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యాశాఖలో 16సంవత్సరాలుగా క్రియాశీలకంగా పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల హామీలో సీఎం కేసీఆర్ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేస్తానని చెప్పినప్పటికి నేటికీ రద్దు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం యాదాద్రి జిల్లా నాయకులు నాగార్జున, శ్రావణ్, రవి, స్వామి, తిరుపతి, యాదగిరి, మోహనాచారి, శ్రీనివాస్, వెంకటేష్, చందర్, భిక్షపతి, మహేష్, బసవలింగం, రాములు, శివరంజని, కవిత, చైతన్య, సునీత, స్వప్న, నవిత, రేణుక పాల్గొన్నారు.

వైభవంగా ఊంజలి సేవోత్సవం

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాళ్ అమ్మవారి ఊంజలి సేవోత్సవాన్ని ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అద్దాల మండపంలో అమ్మవారికి ఊంజలి సేవోత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు మంగళ హారతులతో సేవకు స్వాగతం పలికారు. ఇక ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి ఆచార్యులు విశేష పూజలు నిర్వహించారు. నిత్యకల్యాణం, జోడు సేవోత్సవాల్లో భక్తులు పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు.


ఆండాళ్ అమ్మవారి సేవోత్సవాన్ని మాఢవీధిలో ఊరేగిస్తున్న ఆచార్యులు

దీక్షకు సంపూర్ణ మద్దతు


దీక్షకు మద్దతు తెలుపుతున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట): ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమం న్యాయబద్ధమైందని, ఈ దీక్షకు విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి తెలిపారు. శుక్రవారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. మాదిగలు, ఉపకులాలకు న్యాయం జరగాలని మందకృష్ణ 30 ఏళ్లుగా ఉద్యమం చేస్తున్నారన్నారు. అధికారంలోకి వస్తే వర్గీకరణ చేస్తామన్న బీజేపీ ఈ అంశాన్ని విస్మరించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టల మల్లేష్, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస చారి, ఉపాధ్యక్షులు నాగార్జున చారి, సభ్యులు కృష్ణమాచారి, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు బోడ శ్రీరాములు, పట్టణ ఇన్‌చార్జ్ దైద వెంకన్న, పట్టణ అధ్యక్షుడు బొజ్జ వెంకన్న, నవీన్, వెంకన్న, గురువయ్య పాల్గొన్నారు.

వెయ్యేళ్లనాటి చాముండేశ్వరి శిల్పం

- క్రీస్తుశకం 1427 నాటి శిలాశాసనం
- యాదాద్రి జిల్లాలో వెలుగులోకి..
- గుర్తించిన పురావాస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి


బండపై ఉన్న వెయ్యేళ్లనాటి చాముండేశ్వరి శిల్పాన్ని పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం గ్రామంలో క్రీస్తుశకం 10వ శతాబ్దానికి చెందిన చాముండేశ్వరి శిల్పంతోపాటు క్రీస్తుశకం 1427నాటి శిలాశాసనం వెలుగులోకి వచ్చాయి. తన పరిశోధనలో భాగంగా పురావాస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి శుక్రవారం గ్రామంలో పర్యటించారు. అందులో భాగంగా చేపట్టిన పరిశోధనలో గ్రామ పరిసరాల్లోని పొలాల్లో ఉన్న బండరాయిపై చెక్కి ఉన్న చాముండి శిల్పాన్ని గుర్తించారు. శిల్పం గోరక్షక ఆసనంలో ఉంది. శిల్పానికి సంబంధించి వివరాల కోసం కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్‌ను సంప్రదించగా.. చాముండేశ్వరి శిల్పం రాష్ట్ర కూటుల అనంతకాలానికి చెందినదిగా తనతో చెప్పారని శివనాగిరెడ్డి తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని ఊర చెరువు కట్టపై శిలా శాసనాన్ని గుర్తించారు. క్రీస్తుశకం 1427 ఏళ్లనాటి రేచర్ల వంశీకుడైన రావు మాధవన్నపుని కాలం నాటి శిలాశాసనంగా నిర్ధారించారు. వాల్మీకి రామాయణాన్ని తన అనువాదంలో రాఘవీయం అని శాసనంపై రాసి ఉందని తెలిపారు. చరిత్రను రక్షించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

చట్టప్రకారం కార్మికుల వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న యూసఫ్

భువనగిరి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్‌వైజర్లకు చట్టప్రకారం వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం భువనగిరి పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరాల తరబడి కనీస వేతనాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం గత సంవత్సరం విడుదల చేసిన కొత్త టెండర్ పాలసీ ప్రకారం ప్రతి కార్మికుడికి రూ.15,600 ఇవ్వాలని నిర్ణయిస్తూ జీఓ జారీ చేసినా నేటికీ అమలు చేయడం లేదన్నారు. దళారులు, కాంట్రాక్టర్లు, కార్మికులకు పూర్తి స్థాయి వేతనం ఇవ్వకుండా ఇష్టానుసారంగా చెల్లించడం జరుగుతుందని ఆరోపించారు. ఆస్పత్రుల్లో కూడా టెండర్ గైడ్‌లైన్స్ ప్రకారం కార్మికుల సంఖ్యను పూర్తి స్థాయిలో భర్తీ చేయకుండా అక్రమాలకు పాల్పడతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ చిన్ననాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోరేటి రాములు ఎండీ ఇమ్రాన్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు గుండు వాణి, మేడబోయిన లక్ష్మి, పుష్ప, సుగుణ, అండాలు, కృష్ణ, నరసింహ, కృష్ణవేణి, హేమలత, సులోచన, నాగరాణి, శారద, విజయలక్ష్మి, మహేందర్, శేఖర్, కిరణ్, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, గర్భాలయంలోని శ్రీమూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. అదే విధంగా స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా స్వామిఅమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలంకరణతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.